ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 9 మే 2024

అడవిని కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత 7లో..

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి 7లో..



కమలోత్సాహం

- వేములవాడలో మోదీ సభ సక్సెస్‌తో బీజేపీలో జోష్
- భారీగా తరలివచ్చిన ప్రజలు
- రాజన్న ఆలయంలో 30 నిమిషాలు గడిపిన ప్రధాని
- బండి సంజయ్ విజయం ఖాయమైందని అనడంతో హోరెత్తిన సభ

సిరిసిల్ల/వేములవాడ, మే 8 (ఆంధ్రజ్యోతి) వేములవాడలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభ ఆ పార్టీ నాయకులు, నేతల్లో ఉత్సాహం నింపింది. మూడు రోజుల్లో ప్రచారం ముగియనుంది. ఈ దశలో ప్రధాని వచ్చి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి మద్దతు తెలపడంతో పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం ఎన్నికల వేములవాడ జన బహిరంగ సభకు వచ్చిన ప్రధాన మంత్రి మోదీకి బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో పూజ, దర్శనం అనంతరం బహిరంగ సభ వద్దకు మోదీ చేరుకున్నారు. సభకు వచ్చిన ప్రజలు మోదీమోదీ అంటూ నినాదాలు హోరెత్తించారు. ప్రధాని ప్రసంగించగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ తెలుగులో అనువదించారు.

ఉదయం 10 గంటలకే ఇంత జనమా..

సభ ఉదయం 10 గంటలకే జరిగినా ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంపై మోదీ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇంత ఉదయమే పెద్ద ఎత్తున్న ప్రజలు తరలిరావడం ఎక్కడా చూడలేదన్నారు. తమను ఆశీర్వదించేందుకు వచ్చిన ప్రజలను శిరస్సు వంచి నమస్కరించారు. బండి సంజయ్‌ని చేయి పట్టి అభినందించారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ విజయం ముందే ఖాయమైంద న్నారు. సభ జరుగుతుండగా బీజేపీ కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు...

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా పోలీసులు వేములవాడలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్ ఎస్‌జీ, భద్రతా బలగాలు, పోలీసులు 1200 మందితో బందోబస్తు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు గస్తీ నిర్వహించాయి.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు

ప్రధాని నరేంద్రమోదీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి గురించి మాట్లాడిన కాంగ్రెస్ సరైన దర్యాప్తు జరగకుండా బీఆర్ఎస్‌ను కాపాడే ప్రయత్నం చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తోడు దొంగలు, సిండికేట్ పార్టీలేనని అన్నారు. కరీంగనర్‌లో బండి సంజయ్ విజయం ముందే నిర్ణయమైందని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గురించి ఎవరికీ తెలియదన్నారు. పీవీ నరసింహారావును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా అవమానించిందని ఆయన విమర్శిం చారు. పీవీ మరణం తరువాత ఆయన పార్థివదేహాన్ని గౌరవించకుండా బయటకు తరలించిందని అన్నారు. పీవీకి భారతరత్నతో గౌరవించిన ఘనత బీజేపీదేనని అన్నారు. హైదరాబాద్‌లో పీవీ కుటుంబ సభ్యులను కలుసుకున్నానని మూడు తరాలతో ముచ్చటించే అదృష్టం దక్కిందని అన్నారు.

రాజన్నకు పూజలు, కోడె మొక్కు

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. బుధవారం వేములవాడకు వచ్చిన ఆయన రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం వద్దకు చేరుకోగానే ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్వామివారికి కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం లక్ష్మీగణపతి స్వామిని, రాజరాజేశ్వర స్వామి వారిని, రాజరాజేశ్వరీ దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఉప ప్రధాన అర్చకులు చంద్రగిరి శరత్, నమిలికొండ ఉమేష్‌శర్మ ప్రధాని మోదీకి స్వామివారి ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు.

రాజన్నను దర్శించుకున్న తొలి ప్రధాని

రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్న తొలి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ నిలిచారు. గతంలో పలువురు ముఖ్యమంత్రులు, గవర్నర్లు, కేంద్ర మంత్రులు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకు న్నప్పటికీ దేశంలోనే అత్యున్నత పదవి అయిన ప్రధానమంత్రి హోదాలో ఉన్న వారెవరూ వేములవాడను సందర్శించలేదు.



ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ, బీజేపీ అభ్యర్థులు

కాంగ్రెస్‌లో చేరిన బుగ్గారం జడ్పీటీసీ, ఎంపీపీ


సీఎం రేవంత్‌రెడ్డితో జడ్పీటీసీ, ఎంపీపీ

బుగ్గారం, మే 8: బుగ్గారం మండల జడ్పీటీసీ బాదినేని రాజేందర్, ఎంపీపీ బాదినేని రాజమణి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం ఆర్మూర్‌లో జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి బాదినేని దంపతులు కాంగ్రెస్ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ముందుండి నడిచామని, 15 సంవత్సరాల నుంచి ఎంపీపీగా, జడ్పీటీసీగా ప్రజలకు నీరంతరం సేవలు చేశామన్నారు. కానీ బీఆర్ఎస్ పార్టీ తమను గుర్తించలేదని అందుకే బీఆర్ఎస్‌కు రాజీనామా చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆహ్వానం మేరకు కాంగ్రెస్‌లో చేరామని తెలిపారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్


అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. బుధవారం పలువురు అధికారులతో సెల్‌ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధిహామీ పథకం కూలీలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈజీఎస్ కూలీలకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల పనిచేసే ప్రదేశాల్లో కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వేసవిలో ఎండ వేడి ఎక్కువగా ఉన్నం దున ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలి

డీఆర్‌డీవో సంపత్‌రావు


మద్దులపల్లిలో ధాన్యం నిల్వలు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

పెగడపల్లి, మే 8: ధాన్యం కొనుగోల్లు త్వరితగతిన పూర్తి చేయాలని డీఆర్‌డీవో సంపత్‌రావు పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి, అయిత్‌పల్లి గ్రామాలలోని సెర్ఫ్ ఆద్వర్యంలో మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుదవారం డీఆర్‌డీవో సంపత్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ బుక్స్, తూకం పూర్తయిన ధాన్యం డాటా ఎంట్రీ , మిల్లులకు తరలింపు ఎంతమేర జరిగింది తదితర అంశాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం సమత, సీసీలు, వీవోఏలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, మే 8: మండలంలోని గొల్లపల్లికి చెందిన బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, చందు, తిరుపతి, మహేందర్, వేణు, తీపిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అన్నదాన ట్రస్ట్ అధ్యక్షుడిగా రవీందర్

రాయికల్, మే 8: మండలంలోని అల్లీపూర్ వేంకటేశ్వరస్వామి ఆలయ శాశ్వత అన్నదాన ట్రస్ట్ అధ్యక్షుడిగా ఎర్రవేణి రవీందర్ ఎన్నికయ్యాడు. గ్రామంలో నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా కొప్పుల దేవి, ప్రధాన కార్యదర్శిగా కట్ట రాజేష్, కోశాధికారిగా కొల్లూరి రాజేష్, ప్రచార కార్యదర్శిగా అత్తినేని నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా గొడ్డండ్ల శేఖర్, చిలుముల ప్రేమ్ చంద్‌లు ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా మనీష్, రచన్, రాజేందర్, శ్రీనివాస్, మహేష్, రాజేందర్, రెడ్డిలు ఎన్నికవగా, గౌరవ సలహాదారులుగా మండ రవి, వేముల సతీష్, శ్రీరాముల గణపతి, అంబారి వెంకట్ రెడ్డి, బాలె చంద్రశేఖర్, అత్తినేని గంగారెడ్డి, మోర వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అంబారిపేటలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కథలాపూర్, మే 8: మండలంలోని అంబారిపేట ఉన్నత పాఠశాలలో 2009-10 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. బాల్యం నాటి తీపి గురుతులను గుర్తుచేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. గురువులను శాలువాతో సత్కరించి పాదాభివందనం చేశారు. పదేళ్ల ఒకే చోట చదివిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా కలిసి సహపంక్తి భోజనం చేశారు.

ఓటును అమ్ముకోవద్దు

- పెద్దపల్లి పార్లమెంట్ పీపీఐడీ అభ్యర్థి నరేష్


ఓటరు కాల్లు మొక్కుతున్న మోతె నరేష్

ధర్మపురి, మే 8: డబ్బుకు, మద్యానికి ఓటు అమ్ముకోవద్దని, ఐదు సంవత్సరాల జీవితం తాకట్టు పెట్టొద్దని ఓటర్లను పెద్దపల్లి పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా డెమోక్రటిక్ పార్టీ (పీపీఐడీ)ఎంపీ అభ్యర్థి మోతె నరేష్ సూచించారు. ధర్మపురి పట్టణంలో ఆయన ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్, కమలాపూర్ చౌరస్తా వద్ద కూరగాయల విక్రయదారులు, దుకాణదారులు, ద్విచక్ర వాహనదారుల వద్దకు వెళ్లి అయ్యా బాంచన్ అంటూ కాళ్లు మొక్కుతూ ఓటు అభ్యర్థించారు. డబ్బుకు, మద్యానికి అమ్ముడుపోవద్దని, ఐదు సంవత్సరాల జీవితం తాకట్టు పెట్టొద్దు అంటూ మెడలో ఖాళీ మద్యం బాటిళ్ల వేసుకుని ప్రచారం చేశారు. ఎండపల్లి మండలంలోని అంబారిపేటకు చెందిన నరేష్ పార్లమెంట్ పరిధిలో ఉన్న యువతీ, యువకులు, మేధావులు, ఉద్యోగులు, రైతులు, సింగరేణి కార్మికులు, ఆటో డ్రైవర్స్ ప్రతి ఒక్కరు తన పండ్ల బుట్ట గుర్తుపై ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని నరేష్ కోరారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి

- రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్ చౌహాన్

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ కమిషనర్ డీఎస్ చౌహాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలో మల్యాల మండలం రామన్నపేట ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని, మల్యాల పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను, సందర్శించిన అనంతరం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జగిత్యాలకు వచ్చిన డీఎస్ చౌహాన్‌ను మర్యాదపూర్వకంగా జిల్లా పారా బాయిల్డ్ రైస్‌మిల్లర్లు, రా రైస్ మిల్లర్లు కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డీఎస్ చౌహాన్ మాట్లాడారు. జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి స్థాయిలో కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని రైతులు అధైర్య పడవద్దని తెలిపారు. ధాన్యం అమ్ముకునేందుకు రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు పంపించేందుకు ఎలాంటి సమస్య రాకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే రైస్‌మిల్లులకు తరలించి సకాలంలో వారి ఖాతాలలో డబ్బులు జమ అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయడానికి ఎటువంటి డబ్బుల ఇబ్బంది లేదని, ధాన్యం అమ్ముకొని ఖాతాల్లో డబ్బులు పడ్డప్పుడే రైతులు ఆనందంగా ఉంటారని తెలిపారు. ఇందుకు సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, సివిల్ సప్లయి డిప్యూటీ మేనేజర్ (మార్కెటింగ్) అభిషేక్ సింగ్, అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా సివిల్ సప్లయి అధికారి వేంకటేశ్వర్‌రావు, మేనేజర్ హతీరాం, డీఆర్‌డీఓ సంపత్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారిణి వాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, జిల్లా బాయిల్డ్ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నవీన్, నాయకులు మధు, రా రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నూనె శ్రీనివాస్, షైలారపు రాంబాబు, నాయకులు దువ్వ రాజు, జిల్లా లారీ ట్రాన్స్ పోర్టు ప్రతినిధులు శ్రీనివాస్, బొమ్మెన శంకర్, సివిల్ సప్లయి శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రెడ్ క్రాస్ దినోత్సవం


వేడుకలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

జగిత్యాల టౌన్, మే 8: జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో ఉన్న బస్తీ దవఖానాలో బుధవారం ప్రపంచ రెడ్ క్రాస్, రెడ్ క్రెసెంట్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం చేపట్టి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు మంచాల కృష్ణ, వెటర్నటీ ఏడీ నరేష్, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే రెడ్ క్రాస్ లక్ష్యమన్నారు. సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఎప్‌సెట్

కొడిమ్యాల, మే 8: మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నెల ఈనెల 9 గురువారం నుంచి 11 శనివారం వరకు ఎంపీసీ విభాగం విద్యార్థులకు ఎప్‌సెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి. కామాక్షిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ పరీక్షకు 100 మంది విద్యార్థులు అలాట్ అయినట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయికల్, మే 8: రాయికల్ పట్టణానికి చెందిన రిపోర్టర్ బొమ్మకంటి నాగరాజు తండ్రి శంకరయ్య వడదెబ్బతో మరణించగా వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీటీసీ అశ్విని జాదవ్, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవిఅచ్యుత్ రావు, కౌన్సిలర్లు శ్రీధర్‌రెడ్డి, మహేందర్, నాయకులు సాయి కిరణ్, సూర్య తదితరులు ఉన్నారు.

మత విద్వేష రాజకీయాలను తిప్పికొట్టాలి

- తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

మెట్‌పల్లి, మే 8: పార్లమెంట్ ఎన్నికల్లో మత విద్వేష రాజకీయాలను తిప్పికొట్టాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో కోరుట్ల నియోజకవర్గ టీజేయస్ ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డి నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ దేశంలో అవినీతికి పాల్పడుతున్న కార్పొరేట్ల పేర్లు బయటికి రాకుండా మోదీ ప్రభుత్వం ఎలక్షన్ బాండ్ల స్కీమ్ తీసుకొచ్చి అదానీ అంబానీలకు సంపద పెంచడానికి కృషి చేసిందన్నారు. మత విద్వేష రాజకీయలు చేస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. పదేళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణకు చేసిన ప్రత్యేక మేలేమీ లేదన్నారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకుండా తెలంగాణను ఇబ్బందులకు నెట్టిందన్నారు. రాష్ట్రంలోని నీటి పారుదల ప్రాజెక్టును జాతీయ హోదా ఇవ్వలేదని, కృష్ణా జలాలలో తెలంగాణా వాటాను నేటికి తేల్చలేదన్నారు. దేశంలో జరిగిన 2014, 2019 ఎన్నికల సమయంలో రైతుల పంటలకు కనీస మద్దతు ధరలు, స్వామినాథన్ కమిషన్ అమలు గురించి అడుగుతుంటే సాధ్యం కాదనంటున్నారన్నారు. అదానీ వంటి కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం రైతులకు నష్టం చేసే మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిందన్నారు. చట్టాలను తిరస్కరణ కోసం ఉద్యమించిన రైతులను హింసాకాండ చేసి బలి తీసుకొన్న తరువాత రద్దు చేశారన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం సాధించుకున్న 46 చట్టాలను పక్కన పెట్టి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి శ్రమదోపిడికి కార్పొరేట్లకు స్వేచ్ఛను ఇచ్చిందన్నారు. ప్రజల మధ్య ఉండి నిరంతరం సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసే కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు జువ్వాడి నర్సింగరావు, చుక్క గంగారెడ్డి, చింతకుంటా శంకర్, అల్లూరి మహేందర్‌రెడ్డి, తొగిటి అంజయ్య, రెబ్బటి మల్లయ్యయాదవ్, కంతి రమేష్, పసునూరి శ్రీనివాస్, వన్నెల శశి, తెడ్డు ఆనంద్, సురక్ష, దిలీప్, అశోక్, సతీష్, శ్యామ్, రంజాన్, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

ధాన్యం కొనుగోలులో జాప్యంపై రైతుల నిరసన

చందుర్తి, మే 8: ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు బుధవారం చందుర్తిలో నిరసన తెలిపారు. చందుర్తి మండలం తిమ్మాపూర్, రామన్నపేట, చందుర్తికి చెందిన రైతులు ధాన్యం జాప్యాన్ని నిరసిస్తూ చం దుర్తి సింగిల్ విండో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి అనంతరం తహసీల్దార్ కార్యాలయంకి వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య మాట్లాడుతూ మంగళవారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యిం దన్నారు. రోడ్డుపై ధాన్యం ఆరబెట్టి నెలరోజులు అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటివరకు 50 శాతం వరకు దళారులే రైతుల ధాన్యం తూకం వేశార న్నారు. సింగిల్ విండో ఆధ్వర్యంలో ప్రారంభించి కొనుగోలు కేంద్రాల్లో సీరియల్‌గా, ధాన్యం సక్రమంగా తూకం వేయడం లేదన్నారు. చందుర్తి సింగిల్ విండో ఛైర్మన్‌ను, సిబ్బందిని అడిగితే లారీల కొరతతో ధాన్యం కొను గోలు ఆలస్యం అవుతుందని సమాధానం ఇస్తున్నారన్నారు. జిల్లా అధికారుల తో మాట్లాడితే ప్రతి రోజూ 15 లారీలలో ధాన్యం తరలిస్తూ, ధాన్యం తూకం వేస్తున్నామని సమాధానం ఇస్తున్నారు తప్ప, కొనుగోలు జరగడం లేదన్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, లేనిచో రైతులు రోడ్డుపై ధర్నా చేయక తప్పదన్నారు. అవసరమనుకుంటే చలో కలెక్టర్ చేపడతామ న్నారు. సంచికి 41,600 చెప్పి కటింగ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నార న్నారు. ధాన్యం తూకం వేసిన లారీకి 240 క్వింటాలు తరుగు పేరున కటింగ్ చేస్తున్నారన్నారు. చందుర్తికి చెందిన బత్తుల వసంతరావు అనే రైతుకు 80 కిలోలు, మర్రి నిశాంత్ అనే రైతుకు చెందిన ధాన్యం 80 కిలోలు, బత్తుల సూర్యరావు 80 కిలోలు కటింగ్ చేశారన్నారు. ప్రభుత్వం వెంటనే చర్య తీసు కోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు దేవారెడ్డి సత్తిరెడ్డి, తిప్పని శంకర్, తిప్పని గంగయ్య, గుమ్మ శంకర్, దుమ్ము నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఆర్ఎంపీ వైద్యులకు విందు.. ఎన్నికల అధికారుల విచారణ

హుజూరాబాద్, మే 8: హుజూరాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు హుజూరాబాద్ మండలంలోని ఆర్ఎంపీ వైద్యులకు విందు ఏర్పాటు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన కార్యకర్తలు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల ఫ్లాయింగ్ స్క్వాడ్, పోలీసులు సదరు ఫంక్షన్‌హాల్ వద్దకు చేరుకున్నారు. ఇది గమనించిన ఆర్ఎంపీ వైద్యులు, విందు ఇచ్చిన సదరు రాజకీయ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా ఎన్నికలాధికారులు అడ్డుకొని విచారించారు. సదరు ఆర్ఎంపీ వైద్యులు ఎన్నికలాధికారులు నిలదీయగా, బర్త్‌డే ఫంక్షన్‌కు వచ్చామని తెలిపారు. బర్త్‌డే ఫంక్షన్ చేసుకుంటే ఎన్నికలాధికారి అనుమతి తీసుకోవాలని ఎన్నికలాధికారులు ప్రశ్నించారు. ఈ లోగానే ఆర్ఎంపీ వైద్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా అప్పటికే ఆర్ఎంపీ వైద్యులకు గ్రామాల్లో ప్రచారం చేయడానికి నజరానా ముట్టజెప్పినట్లు తెలిసింది. గత నాలుగు రోజుల క్రితం కూడా ప్రైవేట్ టీచర్లకు ఈ ఫంక్షన్ హాల్‌లో విందు ఇచ్చినట్లు తెలిసింది. పూర్తి నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి ఇవ్వను న్నట్లు ఫ్లాయింగ్ స్క్వాడ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

గంగాధర, మే 8: గంగాధర గ్రామ పంచాయతీలో పని చేస్తున్న ఎలక్ట్రీషియన్‌కు విద్యుత్ ఘాతంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర పంచాయతీలో షహీద్ పాషా విద్యుత్ సిబ్బందిగా పనిచేస్తున్నాడు. బుధవారం గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయడానికి విద్యుత్ సిబ్బంది షహీద్‌ను తీసుకెళ్లారు. కాగా సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకున్న లైన్‌మెన్ జంపర్ మార్పిడి చేయడానికి షహీద్‌ను స్తంభం ఎక్కించారు. రాంగ్ ఎల్‌సీతో షహీద్ విద్యుత్ షాక్‌తో కిందపడిపోయాడు. దీంతో అతడి కుడి చేయి నరాలు పూర్తితెగిపోయినట్లు సమాచారం. క్షతగాత్రుడిని కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రాణాపాయం లేదని తెలిసింది. దీనిపై ఏడీని వివరణ కోరగా సబ్ స్టేషన్ ఆపరేటర్, లైన్ మెన్ కమ్యూనికేషన్ లోపంతో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

చిరుత దాడిలో లేగ దూడ మృతి

కోనరావుపేట, మే 8: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామ శివారులో లేగ దూడపై చిరుత దాడి చేయడంతో మృతి చెందింది. వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన మల్లవేని శ్రీనివాస్ రోజులాగే తన పొలం వద్ద లేగ దూడను కట్టేసి ఉంచాడు. మంగళవారం రాత్రి లేగ దూడపై చిరుత దాడి చేయడంతో మృతి చెందింది. 40 వేల రూపాయలు నష్టం వాటిల్లిందని తెలిపారు.

తిమ్మాపూర్‌లో అగ్ని ప్రమాదం

- గుడిసె, పశుగ్రాసం దగ్ధం

ఎల్లారెడ్డిపేట, మే 8: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ శివారు లోని మైసమ్మ చెరువు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. రైతులు అల్లె ముత్తయ్య, ప్రదీప్, కొల కాని లక్ష్మయ్య, రవి, శ్రీనివాస్‌కు చెందిన సుమారు 100 గడ్డి కట్టలు, స్టార్టర్లు, సాగు నీటి పైపులు కాలిపోయాయి. అల్లె ముత్తయ్య, ప్రదీప్‌కు చెందిన గుడిసెతోపాటు అందులోని సామగ్రి దగ్ధమయ్యాయి. చుట్టు పక్కల రైతులు చేరుకుని మంటలను ఆర్పి వేశారు. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు. అధికారులు నష్టం అంచనావేసి ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రమా దం జరిగిన తీరుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవా లని మాజీ ఏఎంసీ ఛైర్మన్, అందె సుభాష్, బీఆర్ఎస్ నాయకులు అనిల్, శంకర్, శేఖర్ సతీష్ కోరారు.

తల్లి మందలించిందని కూతురు ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, మే 8: చదువుకోమంటూ తల్లి మందలించడంతో కూతురు ఆత్మహత్యాయ త్నానికి పాల్పడింది. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన శ్రీనిధి ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఎంసెట్‌కు ప్రిపేర్ అవుతోంది. హైదరాబాద్ వెళ్లి పరీక్ష రాయాల్సి ఉందని, సెల్‌ఫోన్‌తో కాల క్షేపం చేయవద్దంటూ తల్లి పద్మ కూతురును మందలించింది. అనంతరం ఆమె పనికి వెళ్లింది. ఇంట్లో ఉన్న శ్రీనిధి తల్లి మాటలకు మనస్థాపం చెంది తన ఎడమ చేయి మణికట్టుపై కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నిఫా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొలగాని శ్రీనివాస్



నిఫా కార్యవర్గసభ్యులతో కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ రూరల్, మే 8: నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ ఆక్టివిస్ట్స్ (నిఫా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్‌లోని ఒకటో డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ నియామకమయ్యారు. డిల్లీలో జరిగిన నిఫా జాతీయకార్యవర్గ సమావేశంలో కొలగాని శ్రీనివాస్‌ను తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు స్వచ్ఛంద, సామాజిక కార్యక్రమాలు చేపడుతూ నిఫా ఆర్గనైజేషన్‌లో భాగస్వామినైనందుకు సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన నిఫా జాతీయ నాయకత్వానికి కృతజ్ఞ తలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిఫా ఆధ్వర్యంలో స్వచ్ఛంద, సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడానికి కృషి చేస్తానన్నారు. నిఫా జాతీయ కార్యవర్గ సమావేశాల అనంతరం డిల్లీలోని రాష్ట్రపతి భవన్‌ను సందర్శించారు.

మద్యం పట్టివేత

మానకొండూర్, మే 8 : మానకొండూర్ మాజీ సర్పంచు పృథ్వీరాజ్ ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన మద్యం బుధవారం రాత్రి పట్టుకున్న ట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ సమాచారం మేరకు పృథ్వీరాజ్ ఇంటిపై దాడి చేయగా 48 రాయల్ స్టాగ్ క్వాటర్స్, 22 బీర్లు లభ్యమైనట్లు సీఐ తెలిపారు. మద్యం విలువ రూ. 15 వేలు కాగా వాటి ని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సజావుగా ఎప్‌సెట్

- జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల ఏర్పాటు



తిమ్మాపూర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్, మే 8: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్ పరీక్షల బుధవారం జిల్లాలో రెండో రుజూ సజావుగా జరిగాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఒకే సెషన్‌లో జరిగింది. పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతించారు. 9 పరీక్ష కేంద్రాలలో కలిపి 2,931 మంది విద్యార్థులకు గానూ 2,738 మంది హాజరయ్యారు. మొత్తంగా 93.42శాతం హాజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మంగళ, బుధ వారాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాల కోసం పరీక్షలు జరిగాయి. కాగా 9,10,11 తేదీల్లో మూడు రోజుల పాటు ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు తిరిగి మధ్నాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్షలు నిర్వహించనున్నారు.

స్వగ్రామం చేరిన యువకుడి మృతదేహం

బీర్‌పూర్, మే 8: గల్ఫ్ దేశంలో చికిత్స పొందుతూ మృతిచెందిన గల్ఫ్ కార్మికుడి మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. మండలంలోని కొల్వాయి గ్రామానికి చెందిన బంద్ర రాజేష్(30) అనే యువకుడు కొన్ని సంవత్సరాల క్రితం గల్ఫ్ దేశమైన దుబాయికి వెళ్లాడు. కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ ఏప్రిల్ 27న దుబాయ్‌లో మృతి చెందాడు. రాజేష్ మృతదేహం గ్రామానికి రావడంతో రాజేష్ తల్లి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

జగిత్యాలలో వైద్యుల ఆందోళన



మాట్లాడుతున్న తాటిపాముల సురేష్

జగిత్యాల టౌన్, మే 8 :జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుడు శ్రవణ్, సిబ్బందిపై ఇటీవల జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎంఏ హాలులో అధ్యక్షుడు తాటిపాముల సురేష్ కుమార్ మాట్లాడుతూ వైద్యునితో పాటు సిబ్బందిపై దాడికి పాల్పడ్డ వారిని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులు రోగుల బాగుకోసమే పనిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అజయ్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ కళ్యాణ్ కుమార్, వైద్యులు సుధీర్, రమేష్, శ్రీనివాస రెడ్డి, సుజిత్, సురేష్, వేణు బాబు, రాహుల్, రాము, మహేంద్ర నాథ్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పనుల ప్రగతి పరిశీలన

ఎల్లారెడ్డిపేట, మే 8: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో నాబార్డు నిధులతో చేపట్టిన పనుల ప్రగతిని నాబార్డు పరిశీలకులు, విశ్రాంత సీజీఎం రవీంద్ర బుధవారం పరిశీలించారు. నాబార్డు ద్వారా అందిస్తున్న పథకాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని ఆధునిక భవనం, గోదాం, సర్వేపల్లి శివారులోని పెట్రోలు బంకును పరిశీలించారు. గ్రామీణ ప్రాంతంలో మెరుగైన సేవలు అందించేందుకు సహకార సంఘాలకు నాబార్డు కింద నిధులను అందిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడుతూ ప్రగతి పథంలో నడిచేలా చర్యలు తీసుకోవాలని నాబార్డు పరిశీలకులు, విశ్రాంత సీజీఎం రవీంద్ర అన్నారు. అధికారులు సత్యనారాయణ, విష్ణు, సంఘం కార్యదర్శి కిషోర్‌కుమార్ ఉన్నారు.

అడవిని కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత

- డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు

రాయికల్, మే 8: అడవిని కాపాడుకోవడం ప్రతీఒక్కరి బాధ్యత అని డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని అటవీ ప్రాంతాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో ఉపాధిహామీ కూలీలతో సమావేశమై మాట్లాడుతూ ఇంకుడు గుంతలు తీయడం వల్ల వర్షాకాలంలో నీరు భూమిలోకి ఇంకుతాయని, దీంతో భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. వర్షాలు పడటంతో పంటలు సమృద్ధిగా పండుతాయని సూచించారు. అడవులను కాపాడుకోవడంతో స్వచ్ఛమైన గాలి లభిస్తుందని, ఉష్ణోగ్రతను తగ్గించే అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామంలోని ప్రతిఒక్కరూ వారి ఇళ్లల్లో మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. అడవిని ఎవరైనా నరికితే అటవీ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో ప్రణీత్ కౌర్, డిప్యూటీ ఎఫ్‌ఆర్‌వో రవి కుమార్, ఎఫ్‌బీవో నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీఎస్ చౌహాన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయి శాఖలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సివిల్ సప్లయి కమిషనర్ డీఎస్ చౌహాన్‌కు పలువురు ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చిన సివిల్ సప్లయి కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. సుమారు గత పదిహేను సంవత్సరాలుగా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు ఎలాంటి వేతనం పెంపుదల జరగడం లేదని వివరించారు. సివిల్ సప్లయి జిల్లా కార్యాలయంలో పీడీఎస్, సీఎంఆర్, ధాన్యం రవాణా, ఎంఎల్ఎస్ పాయింట్ గన్నీస్, గోడౌన్, క్యాషియర్ తదితర విభాగాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ జగిత్యాల జిల్లా శాఖ నాయకులు జి వంశీ, అరవింద్, మధు, సతీష్, జగన్, సంజయ్, రాంరెడ్డి, శ్రీనివాస్, రాజు, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ప్రతీ ధాన్యం గింజ కొంటాం



గంగాధరలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ చౌహాన్

- రైతులకు నష్టం జరగనివ్వం
- ఎలాంటి ఆందోళన చెందొద్దు
- తరుగుపేరిట కోతలు విధిస్తే కఠిన చర్యలు
- పంటకు మద్దతు ధర అందిస్తాం
- రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్

గంగాధర, మే 8: అకాల వర్షానికి తడిసిన ప్రతీ గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. గంగాధర మండల కేంద్రంతో పాటు మధురానగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన స్వయంగా తేమశాతాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు, ఇంకా కేంద్రాల్లో ఎన్ని క్వింటాళ్ల ధాన్యం ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోనే ధాన్యం పోసిన రైతులతో మాట్లాడారు. కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులున్నాయా, మద్దతు ధర అందుతుందా, అకౌంట్లో డబ్బులు పడ్డాయా అని వివరాలు అడిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు మనోధైర్యం, భరోసా కల్పించేందుకే జిల్లాలో పర్యటిస్తున్నానన్నారు. రైతులకు నష్టం జరగనివ్వమని, ఏలాంటి భయం వద్దని చెప్పారు. అన్ని విధాలా అండగా ఉంటూ అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఎన్ని ఇబ్బందులైనా తాము భరిస్తామని రైతులకుఇబ్బంది కలగనివ్వమన్నారు. మిల్లర్లు తరుగు పేరుతో కోతలు విధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక్క గ్రాం ధాన్యమైన కోత విధించే అధికారం మిల్లర్లతో పాటు ఎవ్వరికి లేదని స్పష్టం చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో అధికారులతో సమావేశం నిర్వహించి రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతితోను పలు అంశాలపై మాట్లాడానని తెలిపారు. అకాల వర్షం పడే అవకాశం ఉన్నందున వారం రోజుల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలాల వారీగా ప్రతి కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని చెప్పారు. తేమశాతం సరిగా వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. మిల్లర్లకు సమాచారం ఇచ్చి ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు. ఆ తరువాత తూకం వేసిన ధాన్యం తడిసిన రైతులకు ఏలాంటి నష్టం జరగకుండా చూస్తామని భరోసా కల్పించారు. ధాన్యం బాయిల్డ్ రైస్‌కు ఉపయోగపడుతుందని, మిల్లర్లకు సైతం ఏలాంటి నష్టం కలగదని చెప్పారు. అధికారుల ఈమేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ధాన్యాన్ని క్లీన్‌చేసి కొనుగోలుకేంద్రాలకు తీసుకువస్తే మద్దతు ధర పొందవచ్చని సూచించారు. అధికారులు ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం తగిన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సివిల్ సప్లయి డీఎం రజనీకాంత్, ఇన్‌చార్జి డీఎస్‌వో సురేష్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీసీవో రామానుజచార్య, డీఆర్‌డీవో శ్రీధర్, గంగాధర ఏడీఏ రామారావు తదితరులు ఉన్నారు.

● రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

భగత్‌నగర్, మే 8: రైతులకు ఇబ్బందులు రాకుండా తేమ శాతం సరిగా రాగానే ధాన్యాన్ని తూకం వేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. బుధవారం కొత్తపల్లిలోని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు సెల్‌నెంబర్‌లు నమోదు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది, ఎంత డబ్బు జమ చేశారు అని అధికారులను అడిగి తెలుసు కున్నారు. ధాన్యం డబ్బులు సకాలంలో బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. ఫోన్ ద్వారా రైతు లచ్చయ్యతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సివిల్ సప్లయీస్ డీఎం రజనీకాంత్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీసీవో రామానుజచార్య, డీఆర్‌డీవో శ్రీధర్ పాల్గొన్నారు.



మల్యాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న కమిషనర్ చౌహాన్

మల్యాల: అకాల వర్షాలతో తడిసిన ప్రతీ ధాన్యపు గింజను మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ స్పష్టం చేశారు. మల్యాల మండలంలోని రామన్నపేట, మల్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఎస్ చౌహాన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రాల్లో ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయరనే అపోహలు, అనుమానాలు వద్దని రైతులకు నష్టం జరుగకుండా చూస్తామని తెలిపారు. తరుగు పేరిట అదనంగా ధాన్యం తూకం వేయడంతో నష్టపోతున్నామని ఈ సందర్భంగా రైతులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా బస్తాకు 40 కిలోల 600 గ్రాముల కన్నా ఎక్కువ ఏ మాత్రం తూకం వేయకూడదని నిర్వాహకులకు సూచించారు. ఈ విషయాన్ని తాను మిల్లర్ల సమావేశంలో తెలుపుతానని అన్నారు. గతంలో కన్న ముందుగా ఈ సారి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని కొనుగోళ్లు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. టార్పాలిన్ కవర్లు, గన్నీ సంచుల కొరత లేదని తెలిపారు. ధాన్యం తరలించడానికి లారీల కొరత ఉందని నిర్వాహకులు తెలపగా అక్కడే ఉన్న పౌరసరఫరాల అధికారులను సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ధాన్యం విక్రయించిన రైతులకు ఫోన్ చేసి ధాన్యం డబ్బులు ఖాతాలో జమ అయ్యాయా లేదా అని తెలుసుకున్నారు. కమిషనర్ వెంట అడిషనల్ కలెక్టర్ రాంబాబు, డీఆర్డీవో సంపత్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి వాణి, సివిల్‌సప్లయ్ అధికారి వెంకటేశ్వర్‌రావు, మేనేజర్ హతీరాం, డీపీఎం విజయభారతి, మల్లేశం, మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్, ఏపీవో చిన్న రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తంగళ్ళపల్లి: వేగంగా వరి ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని పౌర సరఫరాలకమిషనర్ డీఎస్ చౌహాన్‌ఆదేశించారు. బుధవారం తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లి, నేరెళ్ల గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అంకిరెడ్డిపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి డబ్బులు పొందిన రైతుతో కొనుగోలు కేంద్రం నిర్వాహకుడి ద్వారా కమీషనర్ ఫోన్‌చేయించి స్వయంగా మాట్లాడారు. డబ్బులు ఎన్ని రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో పడ్డాయని, ఏమైనా ఇబ్బందులు ఎదురు అయ్యాయా అని ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బందులు కాలేదని సదరు రైతు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ధాన్యం సేకరణ రిజిస్టర్లు తనిఖీ చేశారు. అయన వెంట అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీఆర్డీవో శేషాద్రి, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, ఏపీవో పాపారావు తదితరులు ఉన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



పట్టుబడిన నగదును చూపుతున్న వన్‌టౌన్ సీఐ సరిలాల్

కరీంనగర్ క్రైం, మే 8: ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల బుధవారం పోలీసుల తనిఖీల్లో నగదు పట్టుబడింది. కరీంనగర్‌లో పోలీసులు బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 2లక్షల 9 వేల 6 వందల రూపాయలు నగదు పట్టుబడిందని కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ సరిలాల్ తెలిపారు. రాజీవ్‌చౌక్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా తిలక్‌రోడ్‌కు చెందిన పెద్ది రాధాకృష్ణ వద్ద సరైనా ఆధారాలు లేకుండా నగదు పట్టుబడిందన్నారు. ఈ నగదును తదుపరి ప్రక్రియ నిమిత్తం సంబంధిత అధికారులకు స్వాధీనం చేశామని సీఐ తెలిపారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని మొలంగూర్ క్రాస్ రోడ్ వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ. 58,800 నగదు పట్టుకున్నట్లు ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. సైదాపూర్ మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన మోరె విజయ్ ఎటువంటి ఆధారాలు లేకుండా రూ. 58,800 నగదు తీసుకెళ్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుకున్న నగదును సంబంధిత అధికారులకు అప్పగించినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి, బైపాస్ రోడ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల వద్ద రూ. 9.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు పట్టుకుని జరిమానాలు విధించారు. తనిఖీల్లో ఎస్సైలు నరేష్ , మన్మధరావు తదితరులు ఉన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఎస్సై చిరంజీవి సిబ్బందితో కలిసి బుధవారం వాహనాల తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా ఇద్దరు వ్యక్తులు వేరువేరుగా తమ దిచక్ర వాహనాలపై 1.80 లక్షలు, 1.50 లక్షల నగదును తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న వ్యక్తి నుంచి నగదుకు ఎలాంటి ఆధారాలను చూపించకపోవడంతో అతని వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకోని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు అప్పగించినట్లు తెలిపారు. ఎవరైనా వ్యాపారరీత్యా లేదా ఆసపత్రితో పాటు ఏదైనా అత్యవసర పరిస్థితిల్లో రూ. 50వేలకు పైగా డబ్బులు తరలిస్తే తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు ఉండాలని సూచించారు

400 చీరలు స్వాధీనం

కరీంనగర్ క్రైం, మే 8 : కరీంనగర్‌లో పోలీసులు బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీలలో 400 చీరలు పట్టుబడ్డాయి. కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తా వద్ద నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో వ్యాన్(టీఎస్ 13 ఈటీ 2549)లో సరైన రశీదులు లేని అక్రమంగా తరలిస్తున్న దాదాపు 3 లక్షల రూపాయల విలువ చేసే 400 చీరలతో పాటు ఇతర దుస్తులను పట్టుకుని స్వాధీన పరుచుకున్నామని కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ నుంచి ధర్మపురికి ఈ చీరలు తరలిస్తున్నట్లు చెప్పారు. పట్టుబడిన చీరలను తదుపరి ప్రక్రియకు సంబంధిత అధికారుల వద్దకు తరలించామని తెలిపారు. విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.



చీరలను పట్టుకున్న పోలీసులు

అక్రమ లేఅవుట్లపై విచారణకు ఐజీ ఆదేశం

హుజూరాబాద్, మే 8: హుజూరాబాద్ పట్టణంలో ఏడాది కాలంలో ఏర్పాటు చేసి అక్రమ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లపై విచారణ చేపట్టాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్, స్టాంపు అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల రోజుల క్రితం జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి హుజూరాబాద్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఆయన విచారణకు ఆదేశించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు గతంలో అమ్మిన భూముల రిజిస్ట్రేషన్లపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. కాగా నాలుగు రోజులుగా దీనిపై విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. విచారణతో నాలా కన్వర్షన్, మున్సిపల్ అనుమతి లేకుండా భూములు కొనుగోలు చేసిన వారు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మొన్నటి వరకు ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ ఈ విచారణ జరుగుతుందనే ఉద్దేశ్యంతోనే ముందస్తుగానే సెలవుపై వెళ్లాడు. దీంతో మరొకరిని సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపితే మరిన్న కుంభకోణాలు బయట పడనున్నాయి.

‘నిందితులపై చర్యలు తీసుకోవాలి’

మెట్‌పల్లి, మే 8: కోరుట్ల ప్రభుత్వ ఆసపత్రిలోని డ్యూటీలో ఉన్న డాక్టర్ శ్రావణ్‌కుమార్‌పై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగసాగర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల కితం జరిగిన సంఘటనలో డాక్టర్ శ్రావణ్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయడాన్ని ఖండించారు. ప్రతి వైద్యుడు తమ వద్దకు వచ్చిన రోగిని కాపాడాలనే నిబద్ధతో వైద్యం చేస్తారన్నారు. డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఒంటిపై కిరోసిన్ పోయడంతో పాటు దాడి చేయడాన్ని ఐఎంఏ తరుపున ఖండిస్తున్నట్లు తెలిపారు. వైద్యుడిపై దాడి చేసిన నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధి కారులను కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ యూనియన్ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆనంద్‌బాబు, జాకబ్‌కిరణ్, రమేష్‌రెడ్డి, విద్యాసాగర్, త్రిలోక్, నిర్మల్‌రెడ్డి, పద్మ, త్రివేణి, మానస, సభ్యులు,తదితరులు పాల్గొన్నారు,



ప్రజలు, పార్టీనేతలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ



సభకు వస్తున్న ప్రజలను తనిఖీ చేస్తున్న పోలీసులు



ప్రధాని మోదీ, ఇతర నేతల భారీ కటౌట్లు

ప్రధాని మోదీ సభ
చిత్రమాలిక

వేములవాడలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభ ఆ పార్టీ నాయకులు, నేతల్లో ఉత్సాహం నింపింది. మూడు రోజుల్లో ప్రచారం ముగియనుంది. ఈ దశలో ప్రధాని వచ్చి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి మద్దతు తెలపడంతో పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేశాయి.



సభకు తరలివస్తున్న మహిళలు



సభకు హాజరైన మహిళలు



సభ వద్ద పోలీసుల బందోబస్తు



సభకు హాజరైన జనం, కార్యకర్తలు



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అభివృద్ధిని చూసి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించండి

పెగడపల్లి/వెల్గటూర్ మే 8: ధర్మపురి ఎమ్మెల్యేగా, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్‌గా, మంత్రిగా కొప్పుల ఈశ్వర్ చేసిన అభివృద్ధిని చూసి పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కొప్పుల స్నేహలత పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని సుద్దపల్లిలో, వెల్గటూర్‌లో మండల నాయకులతో కలసి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పని ప్రదేశం వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, నాయకులు నేరెల్ల హరిక గంగాధర్, తిర్మని నర్సింహారెడ్డి, రమణారెడ్డి, నరేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సుస్థిర పాలన కోసం బీజేపీకి ఓటెయ్యండి

పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే

పెగడపల్లి, మే 8: భారత దేశాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తేవడంతో పాటు సుస్థిర పాలన అందించేందుకు గాను కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజెపిని గెలిపించాలని పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే కోరారు. బుధవారం మండలంలోని నందగిరి, అయిత్‌పల్లి, పెగడపల్లి, బతికెపల్లి గ్రామాల్లో శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడారు. బీజేపీకి ఓటు వేసి మరోమారు మోదీని ప్రధానిని చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల నాయకులు కన్నం అంజయ్య, గంగుల కొమురెల్లి, మర్రిపెల్లి సత్యం, మోహన్‌రెడ్డి, చింతకింది అనసూర్య, సాయికృష్ణ, బాబు, అంజన్న పాల్గొన్నారు.

నరేంద్ర మోదీ దేశానికి శ్రీరామ రక్ష

- నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి)/కోరుట్ల, మే 8: నరేంద్ర మోదీ దేశానికి శ్రీరామ రక్షలాంటి వాడని నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. బుధవారం పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ చౌరస్తాలో, కోరుట్ల పట్టణంలోని పాత మున్సిపల్ ప్రాంతంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ ఉగ్రవాద సంస్థలు కాంగ్రెస్‌కు మద్దతులు పలుకుతున్నాయని వారితో కలిసి టోపీలు పెట్టుకోని కాంగ్రెస్ నాయకులు దర్నాలు చేస్తూన్నారని ఆరోపించారు. భవిష్యత్ తరానికి భద్రత కావాలంటే నరేంద్ర మోదీ ప్రదాని చేసి దేశ రక్షణకు శ్రీకారం చుట్టాలని అన్నారు. అనంతరం ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 420 అని, ఓటుకు నోటు కేసుతో తన బండారం బయట పడుతుందని అన్నారు. ప్రస్తుత ఎన్నికలు దేశభక్తి, దేశ ద్రోహుల మధ్య జరుగుతున్నాయని అన్నారు. కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి ధర్మపురి అర్వింద్‌ను గెలిపించాలని కోరురు కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణ రావు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి బోగ శ్రావణి తదితరుల పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం

కొడిమ్యాల, మే 8: కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం కొడిమ్యాల, మండలంలోని నల్లగొండ, బొల్లోనిచెరువు, కొండాపూర్, హిమ్మతురావుపేట గ్రామాల్లో ఇంటింట ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి వినోద్‌కుమార్‌ను పార్లమెంట్‌కు పంపాలని ఓటర్లను కోరారు. బీఆర్ఎస్ నాయకులు తిరుపతి, మల్లయ్య, లక్ష్మన్ తదితరులు ఉన్నారు.

వెలిచాల రాజేందర్‌రావును ఎంపీగా గెలిపించాలి

మల్యాల, మే 8: కరీంనగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వి. రాజేంధరరావును ఎంపీగా గెలిపించాలని ఆయన కుటుంబసభ్యులు మండలంలో ప్రచారం నిర్వహించారు. రామన్నపేట, తాటిపల్లిలో పర్యటించి అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థిని గెలపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారం చేసిన వారిలో రాజేందర్‌రావు సోదరిలు శోభ, అరవింద, అనురాధ, సోదరుడు నిశాంత్, కాంగ్రెస్ మండల నాయకులు ఆనందరెడ్డి, సతీష్‌రెడ్డి, లక్ష్మనాచారి, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల/కథలాపూర్: కరీంనగర్ ఎంపీగా రాజేందర్‌రావును గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు బుధవారం శ్రీరాములపల్లి, అంబారిపేటలో ఇంటింటా ప్రచారం చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ నాయకులు నాగభూషణ్‌రెడ్డి, జగన్‌రెడ్డి, నర్సయ్య, బాపురెడ్డి, సత్యం, అంజయ్య, జవ్వాజి రవి, తోకల దేవయ్య, రాచమల్ల నవీన్, తిక్క రవి, మల్లేశం, జగన్‌రావు తదితరులు ఉన్నారు.

మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు

కథలాపూర్, మే 8: వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో గురువారం నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు కథలాపూర్ నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్ళారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి వందలాది మంది మహిళలు బస్సులు, కార్లలో తరలివెళ్ళారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, గాంధారి శ్రీనివాస్, వినోద్‌రెడ్డి, బండ అంజయ్య, అజయ్‌రావు, మారుతి తదితరులు ఉన్నారు.

మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు

మల్యాల, మే 8: మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జన్మదిన వేడుకలను మల్యాలలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. పట్టణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆనందరెడ్డి, వీరబత్తిని శోభరాణీ, సతీష్‌రెడ్డి, ఆదిరెడ్డి, కట్కూం వినయ్, ప్రతాప్, మంద తిరుపతిగౌడ్, ఇమామ్, నల్లపు మల్లేశం, కోరెపు వెంకటేష్, బట్టు పవన్, తిరుపతి, రాజు పాల్గొన్నారు

కొడిమ్యాల: మండల కేంద్రంలోని అంగడి బజారులో రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెజిడెంట్ జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్

ఏసీసీ, మే 8: దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా దేశాభివృద్ధికి బాటలు వేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాలులో మంచిర్యాల నియోజకవర్గస్థాయి యువ సమ్మేళనంలో ఎమ్మెల్యే గడ్డం వివేకానంద, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణలతో కలిసి పాల్గొన్నారు. ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ మహిళలు, యువత అనుకుంటే ఏదైనా సాధ్యపడుతుం దన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ వస్తే బతకులు మారుతాయని యువత ఆశిం చిందని కానీ అది నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, పక్కన అభ్యర్థి వంశీకృష్ణ

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పాలి

- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల టౌన్, మే 8: పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేచ్చడంలో విఫలమైన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్పి కాంగ్రెస్ అభ్యర్థులను దీవించాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఓటర్లను కోరారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లి, ఎల్ఎల్ గార్డెన్ చౌరస్తాలో బుధవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా రోడ్ షో నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మణ్ కుమార్ హాజరై మాట్లాడారు. జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత జీవన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల మయంగా మార్చారన్నారు. అభివృద్ధికి మారుపేరుగా ఉన్న జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపెల్లి మోహన్, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, కొత్త మోహన్, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాయికల్: నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి టి జీవన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జీవన్‌రెడ్డి కుటుంబసభ్యులు కోరారు. మండలంలోని మైతాపూర్, చెర్లకొండాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


రాయికల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న జీవన్‌రెడ్డి కుటుంబసభ్యులు


జగిత్యాలలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీని అందించాలని కోరారు. కార్యక్రమంలో జీవన్ రెడ్డి పెద్ద కోడలు హరితరెడ్డి, చిన్న కోడలు చరీష్మా రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు తదితరులు పాల్గొన్నారు.

● రాయికల్ పట్టణంలో నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి టి జీవన్ రెడ్డికి మద్దతుగా జగిత్యాల న్యాయవాదులు ప్రచారం చేశారు. చేతి గుర్తుకు ఓటు వేసి జీవన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బుల లక్ష్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు బండ భాస్కర్ రెడ్డి, న్యాయవాదులు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: తెలంగాణలోని ప్రజలను సంతోషంగా ఉంచడమే ప్రధాన లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకానలు అమలు చేస్తున్నారని టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజులలోపే రూ. 500లకే సిలిండర్ గ్యాస్, మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం, 200 యూనిట్లకు జీరో కరెంట్ బిల్లు, రూ. 10లక్షల ఆరోగ్య భీమా, ఆగష్టులోపు రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ, రూ. 500 బోనస్, మహిళలకు వడ్డీలేని రుణాలు వంటి విప్లవాత్మక సంక్షేమ పథకాలను అందజేయడం జరుగుతుందన్నారు. లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. నాయకులు రుత్త నారాయణ, కూన గోవర్ధన్, కూన రాకేష్, అందె మారుతీ, కొమ్ముల చిన్నరెడ్డి పాల్గొన్నారు.

యమ ధర్మరాజు ఆలయంలో అభిషేకం

ధర్మపురి, మే 8: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ యమ ధర్మరాజు ఆలయంలో బుధవారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు ప్రదీప్‌కుమార్, నేరెళ్ల సంతోష్‌కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. రాత్రి వరకు భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో కూడ స్వామి వారలను భక్తులు దర్శనం చేసుకున్నారు. రాత్రి వరకు ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్

వెల్గటూర్, మే 8: వెల్గటూర్‌కు చెందిన మంత్రి దేవేందర్‌పై ఈ నెల 4న జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై ఉమా సాగర్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరిపల్లికి చెందిన బొమ్మల సుమన్, అతని సోదరుడు బొమ్మల డీలేష్ అనే ఇద్దరు వ్యక్తులు ఈ నెల 4న వెల్గటూర్‌కు చెందిన మంత్రి దేవేందర్‌పై హత్యాయత్నం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ జరిపి, బుధవారం వారి ఇంటి వద్ద ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై వివరించారు.

ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలి

కోరుట్ల, మే 8: పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మైనార్టీ ఆత్మీయ సమ్మేళనంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, బోదన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషాతో కలిసి విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమం కోసం ఎంతో పని చేసి పలు పథకాలను అందించిందన్నారు. ప్రస్తుత జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ బలపరిచి కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేస్తున్న బీఆర్ఎస్ పార్టీని బలపరిచి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య- అనిల్, బీఆర్ఎస్ కౌన్సిలర్ల నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను కట్టడి చేయడానికి బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించడానికి కారు గుర్తుకు ఓటు వేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ముత్యంపేట, రాఘవుపేట, మొగిలిపేట గ్రామాల్లో, ఆయా గ్రామ శివారులో పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలను కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన 420 దొంగ హామీలతో ప్రజలు మోసపోయి ఓటు వేసి బాధపడుతున్నారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం చేసే, నిరంతరం ప్రజల మధ్య ఉండే బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ భారీ మెజార్టితో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ఎంపీపీ గౌరు నగేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్, మే 8: ఆరు గ్యారెంటీలతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ అభివృద్ధి చెందిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేశారని అన్నారు. అధికారంలోకి వచ్చి రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని, కరెంట్ కోతలు పెడుతున్నారన్నారు. రాయికల్ పట్టణంలోని శ్రీవేంకటేశ్వర విశ్వబ్రాహ్మణ సేవా సంఘం, విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం సభ్యులను కలిశారు. మండలంలోని కిష్టంపేట, సింగరావుపేట గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాయికల్ పట్టణానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు సుంకె వంశీ కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జడ్పీటీసీ జాదవ్ అశ్విని, మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● **ప్రభుత్వ వైఫల్యాలు ఇంటింటికి ప్రచారం చేయాలి**

మెట్‌పల్లి/మెట్‌పల్లి రూరల్: కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న


ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్


రాయికల్ మండలంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

మోసాలను ప్రజలు గమనించి భవిష్యత్ తరాల కోసం పని చేసే బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజీరెడ్డి గోవర్ధన్ భారీ మెజార్టీతో గెలపించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు. బుధవారం మండలంలోని మేడిపల్లిలో ప్రచారం నిర్వహించారు. మెట్‌పల్లి పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపుకోసం ప్రతి ఒక్కరు కృషి చేయలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల రూరల్: కాంగ్రెస్, బీజేపీ పార్టీల మోసపూరిత హామీలు నమ్మి మోసపోవద్దని జడ్పీచైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా మండలంలోని నర్సింగాపూర్, వంజరిపల్లి గ్రామాల్లో జడ్పీచైర్‌పర్సన్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ కేసీఆర్ బస్సుయాత్ర వల్లే ప్రభుత్వం దిగొచ్చి రైతులకు రైతుబంధు నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. కేసీఆర్ రైతుల సాధకబాధకాలు తెలిసిన వ్యక్తి కాబట్టి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కుడుకల లక్ష్మణ్, పులి మల్లేశంగౌడ్, ర వీందర్‌రెడ్డి, గంగారెడ్డి, మల్లారెడ్డి, గంగారాం, రాజిరెడ్డి, లచ్చన్న, జలందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏమీ చేయని కొప్పుల ఈశ్వర్ ఓట్లు ఎలా అడుగుతారు

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్


రాంనూర్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్, మే 8: పది సంవత్సరాల కాలంలో ధర్మపురి నియోజకవర్గ ప్రాంతానికి ఏమీ చేయని కొప్పుల ఈశ్వర్ ప్రజలను ఓట్లు ఎలా అడుగుతారని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. బుధవారం వెల్గటూర్, రాంనూర్, ముత్తునూర్ గ్రామాలలో పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారం లోకి రాగానే హమీ ఇచ్చిన విధంగా పంచ న్యాయాలు అమలు చేస్తామన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా స్తంభంపల్లి శివారులో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని చేశారని మండిపడ్డారు. ప్రజలు తిరగబడి పోరాటం చేస్తే వారికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టించారని మండిపడ్డారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బోడుక మంజుల గంగయ్య, మాజీ ఉప సర్పంచ్ సందీప్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు, బీసీ సెల్ అధ్యక్షుడు ఉదయ్ గౌడ్, ఎంపీటీసీ మంజుల పాల్గొన్నారు.

పెగడపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాకా వారసుడు గడ్డం వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గజ్జెల కాంతం పిలుపునిచ్చారు. బుధవారం పెగడపల్లిలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. అందుకే పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను ఎంపీగా గెలిపించాలని కోరారు. దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు తొలగించేందుకు కుట్ర చేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు , పేదలు కలలు గన్న ఇందిరమ్మ రాజ్యం కోసం ఎంపీగా వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా కోరారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని ముదిరాజ్‌వాడ, ఇందిరమ్మకాలనీలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలు, రైతులకు 2 లక్షలు రుణ మాఫీ గురించి ఆయన వివరించారు. పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు అండగా నిలిచి చేతి గుర్తుపై ఓటు వేసి పార్లమెంట్‌కు పంపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జక్కు రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి 'బండి'కి మున్నూరు కాపులు మద్దతు తెలపాలి

కథలాపూర్, మే 8: మున్నూరుకాపు సంఘ సభ్యులు కరీంనగర్ ఎంపీ, ప్రస్తుత బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతు ప్రకటించాలని సిరికొండ తాజా మాజీ సర్పంచ్ గాండ్ల వీణస్వామి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆది శ్రీనివాస్‌కు మద్దతు తెలిపి ఎమ్మెల్యేగా గెలిపించుకున్న నేపథ్యంలో ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మున్నూరు కాపులు బండిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. నరేంద్రమోదీ అమలు పరుస్తున్న పథకాలు బండి గెలుపుకు దోహదం చేయనున్నాయన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు 'బడిబాట'

కథలాపూర్, మే 8: సర్కారు బడుల్లో వచ్చే విద్యా సంవత్సరంకుగాను విద్యార్థుల సంఖ్య పెంచడానికి బడిబాట కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని చింతకుంట, బొమ్మెన ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి కొత్తగా బడిలో చేరే వారికి అడ్మిషన్లు ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు పరుస్తున్న పలు పథకాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంబటి రవి, ఎక్కల్‌దేవి రవి, సాయిరెడ్డి, కృష్ణారావు, విష్ణు, పరమేశ్వర్, సులేమాన్ తదితరులు ఉన్నారు.

'ప్రసాద్' నిధుల ఊసే ఎత్తని మోదీ

- మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

చందుర్తి మే 8: దక్షిణ కాశీ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి ప్రసాద్ పథకం కింద ప్రధాని మోదీ నిధులు ప్రకటిస్తారని అనుకున్నామని, రాజన్న ఆలయ అభివృద్ధిపై ఊసేత్త లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి మాట్లాడారు. బీజేపీ నాయకులు దక్షిణ కాశీ అభివృద్ధిపై మాట్లాడతారే కానీ ఎలాంటి నిధులూ మంజూరు చేయలేదన్నారు. పదేళ్లలో అధికారంలో ఉండి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలిపించాలన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వెలిచాల రాజేందర్ రావు గెలిస్తే రాహుల్ గాంధీ ప్రధాని అవుతారన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు, నాయకులు పొద్దుపొడుపు లింగారెడ్డి, బొమ్మ శ్రీరామ్, మూసుకు ముకుందరెడ్డి, భీమరాజు కనకరాజు, ధర్మపురి శ్రీనివాస్, పులి రేణుకసత్తయ్య, ప్రభాకర్, చింతపంటి రామస్వామి, దేవస్వామి, బాణాల రవీందర్ రెడ్డి, బొజ్జ మల్లేశం, ఎనగంటి శంకర్, దూది శ్రీనివాసరెడ్డి, ముసుకు పద్మ, మల్లారపు రాజయ్య, బండారి శేఖర్ పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసేందుకే..

రుద్రంగి: ప్రజలకు సేవ చేయడానికి ఎన్నికల్లో నిలబడినట్లు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. కరీంనగర్ పరిధిలో ఎంపీల్యాడ్స్ కింద రూ.25 కోట్లు మంజూరవగా 5 కోట్లు మాత్రమే అభివృద్ధి పనులకు ఖర్చు చేశారన్నారు. మిగతా రూ.20 కోట్లు ఖర్చు చేయడం చేతకాక మురిగిపోయాయన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యంగాన్ని రద్దు చేయాలని కుట్ర చేస్తోందన్నారు. చేతి గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జడ్పీటీసీ గట్ల మీనయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, చెలుకల తిరుపతి, ఇప్ప మహేష్, భైరి గంగమల్లయ్య, అభిలాష్ నర్సరెడ్డి, నారాయణ, వెంకటేశం, పల్లి గంగాధర్, పిడుగు లచ్చిరెడ్డి, తర్రె లింగం, దర్న మల్లేశం, సూర యాదయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాజకీయాల కోసమే మోదీ పర్యటన

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, మే 8: వందల కోట్లతో వారణాసి (కాశీ)ని అభివృద్ధి చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజన్న గుడికి మాత్రం నయాపైస ఇవ్వకుండా పూర్తిగా విస్మరించారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. బుధవారం సాయంత్రం ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఈరోజు వేములవాడకు వచ్చిన మోదీ పర్యటన పూర్తిగా రాజకీయాల కోసమే తప్పా వేములవాడ రాజన్న గుడి అభివృద్ధి కోసం, ఈ ప్రాంత ప్రజల కోసం రాలేదని విమర్శించారు. రాజన్న గుడిలో పూజలుచేసిన ప్రధాన మంత్రి రాజన్న గురించి ఒక్క మాట మాట్లాడలేదని, ఒక్క హామీ కూడా ఇవ్వలేదని అన్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన వేములవాడ దేవస్థానం గురించి మాట్లాడకపోవడం శోచనీయమని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం ఆలయాలను ఒక సర్క్యూట్ చేయాలని, అభివృద్ధి ప్రత్యేక నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని గతంలో కోరామన్నారు. మోదీ సర్కార్ ఇందుకు నిధులు ఇవ్వలేదని విమర్శించారు. రాజన్న గుడిని బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి చేశామని వినోద్‌కుమార్ చెప్పారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేసే ఎంపీ బండి సంజయ్‌కుమార్ రాజన్న గుడికి నిధులు ఇవ్వాలని ఎందుకు ప్రధానిని అడగలేదని ప్రశ్నించారు. ఇతర సమస్యలపైగాని ఒక్క మాటకూడా ప్రధాని మోదీ ముందు అడగలేని సంజయ్ ఎంపీగా ఉండడమెందుకన్నారు. ఎంపీగా తన బాధ్యతలను బండి సంజయ్ పూర్తిగా విస్మరించారని వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రాదనే అసహనంతో ప్రధాని మోదీ నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారని అన్నారు. తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని వినోద్‌కుమార్ కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీలు ఎల్ రమణ, టి భానుప్రసాద్‌రావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, అక్బర్ హుస్సేన్, పన్యాల భూపతిరెడ్డి, పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్